ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

సోమవారం 8 డిసెంబరు 2025

ఓటర్లకు గాలం

- గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఆఫర్లు
- గంపగుత్త ఓట్లపై నజర్
- కుల సంఘాలకు తాయిలాల ఎర
- జిల్లాలో తొలి, మలి విడతల ప్రచార హోరు



జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మొదటి విడతలో 122 పంచాయతీలు, 1,172 వార్డులు ఉన్నాయి. ఇందులో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 461 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, వార్డు సభ్యుల స్థానాలకు 1,954 మంది పోటీ పడుతున్నారు. వీటికి ఈనెల 11వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో 144 సర్పంచ్, 1,256 వార్డు స్థానాలున్నాయి. ఇందులో 10 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 134 సర్పంచ్ స్థానాలకు గానూ 521 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రెండో విడతలో 1,256 వార్డు స్థానాలకు గానూ జగిత్యాల రూరల్ మండలం గుట్రాజుపల్లిలో ఒకటవ వార్డుకు స్థానిక పరిస్థితుల వల్ల నామినేషన్ దాఖలు కాలేదు. 330 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 925 స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, 2,624 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బరిలో ఉండే అభ్యర్థు లెక్క తేలడంతో ఇక ప్రచారం ముమ్మరం చేయడమే కాకుండా గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా హామీలతో పాటు ఆఫర్లు చేస్తున్నారు. గంపగుత్త ఓట్లను రాబట్టేందుకు కుల సంఘాలకు భారీగా తాయిలాలతో గాలం వేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న ఓటర్లను పోలింగ్ రోజున రప్పించుకోవడానికి సంప్రదింపులు జరుపుతున్నారు.

● కోడి కూయక ముందే ప్రచారం ప్రారంభం

గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటుండడంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కోడి కూయక ముందే ఇళ్లకు వెళ్లి ప్రచారాలు ప్రారంభిస్తున్నారు. జిల్లాలోని పలు పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఉదయం వేళలోనే ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. సూర్యోదయానికి ముందే అభ్యర్థులు తమ అనుచరగణంతో గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో ఉదయం వేళల్లోనే గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

● వలస ఓటర్లపై గురి

పల్లెలకు చెందిన పలువురు వ్యక్తులు దగ్గరలో గల పట్టణాల్లో స్వయం ఉపాధి పొందుతుండడం, వ్యాపారాలు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిని కలిసి ఓటు అడగడానికి అభ్యర్థులు మధ్యాహ్నం సమయాల్లో పట్టణాల్లో సైతం ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం వరి

(మిగతా 8వ పేజీలో)

● వ్యూహాత్మక ప్రచారం

తొలి విడత ఎన్నికలు జరుగుతున్న కోరుట్ల సెగ్మెంట్‌లోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లోని ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని ప్రారంభించడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో మలి విడత పంచాయతీ ఎన్నికలల్లో నామినేషన్ల ఉపసంహరణ ముగిసి బరిలో ఉండే అభ్యర్థులు తేలిపోవడం, గుర్తుల కేటాయింపులు పూర్తికావడం తో అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించారు. రైతు లు, వ్యాపారులు, ఓటుహక్కును కలిగియున్న విద్యార్థులు, బీడీ కార్మికులు సూర్యోదయం అయిన తదుపరి కొద్ది గంటలకే తమ దైనందిన కార్యక్రమాల్లోకి వెళ్ళి పోతుండడంతో అభ్యర్థులు ఓటర్లను కలవడానికి ఉదయం, సాయంకాలం వేళలను ఎంచుకుంటున్నారు.

సహస్ర లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సహస్ర లింగాల ఆలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లింగానికి అభిషేకం, అన్నాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంకష్ట హర చతుర్థి సందర్భంగా మహాగణపతికి అభిషేకం, పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ నలుమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

మల్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టులో పది రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం అయి నష్టపోయిన బాధిత కుటుంబాలకు స్థానిక శివ సైనిక్ యూత్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం చిరు వ్యాపారులకు 53వేల రూపాయల నగదు అందించారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్ డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి శివానందకు జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త సూరజ్ శివశంకర్ 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. దస్నాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసి దంపతులు రాజేశ్వర్-పూజల కుమార్తె అయిన శివానంద ఇచ్చోడ గురుకులంలో ఇంటర్ చదివి ఆల్ ఇండియా స్థాయి నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి వికారాబాద్ మహావీర్ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించగా విద్యార్థి ఆర్థిక అవసరాలు ఆమె స్నేహితుల ద్వారా తెలుసుకుని సహాయం అందించినట్లు శివశంకర్ తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

-రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు మనోహర్

జగిత్యాలరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోహర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మనోహర్ ఎన్నికల నియామవళిపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎంపీడీవో రమాదేవి, ఎస్ఐ ఉమాసాగర్, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ చౌడారపు గంగాధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన

బీర్‌పూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆదివారం ఎన్నికల నియమ నిబంధనలపై బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రత్యేక సమావే శాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అభ్యర్థులకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ఖర్చుల అధికారి మనోహర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో మధుసుధన్, రిటర్నింగ్ అధికారులు, ఎఫ్ఎసీ ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి'

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. మండలంలో 37,724 మంది ఓటర్లు ఉండగా బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. 226 మంది ప్రిసైడింగ్ అధికారులు, 8 మంది రూట్ ఆఫీసర్లు, నలుగురు జోనల్ అధికారులు, 23 మంది స్టేజ్ 2 ఆఫీసర్లతో పోలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. చింతకుంటలో 3 కెమేరాలతో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని పేర్కొన్నారు. 188 వార్డులకుగాను సర్పంచ్ సహా 3 వార్డులు ఏకగ్రీవమైన నేపథ్యంలో 185 వార్డులకు 18 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. దివ్యాంగుల కోసం వీల్ ఛైర్‌లను సమకూర్చనున్నాయని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

బీర్‌పూర్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలానికి చెందిన ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేసినట్లు అర్హులంతా వినియోగించుకోవాలని ఎంపీడీవో భీమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండవ విడత పోలింగ్ నిర్వహణ కోసం ఆయా ప్రాంతాల్లో ఎన్నికలలో విధులు నిర్వహించడానికి వెళ్లే ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ వేయడానికి బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఈ12న ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీరపూర్ మండంలో ఓటు కల్గి రెండవ విడత ఎన్నికల డ్యూటీలు పడిన సిబ్బంది ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మహాత్మ విద్యానికేతన్‌లో 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో సమ్మేళనంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శృంగేరి శారద పీఠ ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపలి సంతోష్ కుమార్‌శాస్త్రితో నిర్వహిస్తున్న మహాభారత ప్రవచన మహాయజ్ఞంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని రెండవ రోజు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణవాడలో రామాలయం వద్ద ధ్యాన మందిర నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో డా. బిమానాతిని శంకర్, టివి సూర్యం, అనిల్, కోటేశ్వరరావు, వంశీ బాబు, గంగధర్, నిర్వాహకులు, ఆధ్యాత్మిక బృందం సభ్యులు చెట్ల చంద్రశేఖర్, శీల శ్రీనివాస్, మార కైలాసం, కోటగిరి శ్రవన్ కుమార్, భోనగిరి రాంనారాయణ, రాంచంద్రం పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్‌లకు ఎమ్మెల్యే అభినందన



ఏకగ్రీవ విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, వార్డులల్లో ఏకగ్రీవంగా ఎన్నికయిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల విజేతలను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అభినందించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామ ఏకగ్రీవ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్, పలువురు వార్డు సభ్యులను, జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన పలువురు ఏకగ్రీవ వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి హరి అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశంలో కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై 33 జిల్లాల తమ అసోసియేషన్ కార్యవర్గంతో చర్చలు జరిపి కార్యాచరణ నిర్ణయం చేస్తారన్నారు. కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, పిసి హన్మంత్ రెడ్డి, వెల్మల ప్రకాశ్ రావు, డిండిగాల విఠల్, అరిగెల విజయలక్ష్మీ, కరుణ పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేసిన కాంగ్రెస్'

రాయికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ఆరోపించారు. కాంగ్రెస్ అరాచకానికి బీసీ బిడ్డ ఈశ్వర చారి బలయ్యాడని ఆమె విమర్శించారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడాన్ని తట్టుకోలేక ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఈశ్వర చారి మృతిచెందాడన్నారు. ఆయన చిత్రపటానికి రాయికల్ పట్టణంలో ఆదివారం నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈశ్వర చారి మరణం చాలా బాధాకరమని, దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్రంతో ఒప్పించి చట్టబద్ధంగా రిజ్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. బీసీ బిడ్డ ఆత్మ బలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమాజం ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఈశ్వర్ చారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏలేటి అనిల్, మాజీ మార్కెట్ చైర్మన్లు ఉదయశ్రీ, రాణి సాయికుమార్, కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సాయి కుమార్, మహేష్ గౌడ్, మహేందర్, నాయకులు ప్రశాంత్ రావు, రాంప్రసాద్, రాంచంద్రం, ప్రణయ్, వర్షిత్ పాల్గొన్నారు.



ఈశ్వర చారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీ చైర్ పర్సన్

ఈశ్వర చారికి కొవ్వొత్తులతో నివాళి

రాయికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర చారికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మానాల వెంకటి, గౌరవాధ్యక్షుడు పిప్పోజి మహేందర్ బాబు, గద్దె రాజు, చింతల అజయ్ కుమార్, అందె శంకర్, మానాల శ్రీహరి, పాలిక రవీందర్, గట్టుపెల్లి చిన్న మల్లయ్య, కుంబోజి నారాయణ, కుంబోజి కిషన్, శ్రీగద్దె నరేష్, కుంబోజి రామకృష్ణ, మగ్గిడి మురళి, శ్రీగద్దె సాగర్, దొంతి మహేష్, అందె నరేందర్, శ్రీగద్దె పెద్ద భీమయ్య, గన్నవరం గంగాధర్, బెజ్జారపు అంజయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి'

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గోరక్ష సంపర్క రాష్ట్ర ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి కోరారు. విశ్వహిందూ పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దేశీగోవంశ రక్షణ సంవర్ధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గోవులను జాతీయ ప్రాణిగా గుర్తించాలని, అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధలను తక్షణమే మూసివేయాలన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల పరిధిలో జిల్లా స్థాయిలో గోశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 1977 గోహత్య నిషేధ చట్టంను అమలుచేసి గోవులను రక్షించేలా చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి పద్మాకర్, కార్యదర్శి కస్తూరి రాజన్న, కోశాధికారి మామిడాల రాములు, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్, నగర సామాజిక సమరసత ప్రముఖ్ పరంధాం తదితరులున్నారు.



మాట్లాడుతున్న గోరక్ష సంపర్క్ ప్రముఖ్

జోరుగా ధాన్యం కొనుగోళ్లు..

-ఇప్పటి వరకు జిల్లాలో 2,86,632 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో నగదు జమ

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 61 కేంద్రాలు మూతపడ్డాయి. వచ్చే రెండు వారాల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులతో దిగుబడులు తగ్గడంతో ధాన్యం అంచనా మేరకు కేంద్రాలకు రాలేదు. దీనికి తోడు పలువురు రైతులు ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం అమ్ముకున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ జరగలేదు. జిల్లాలో ప్రస్తుత 2025-26 వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 2,86,632 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు.

● 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగు..

2025 వానాకాలంలో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 4.20 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం ఎక్కువగా ఉంది. అక్కడక్కడ సన్న రకం సాగు జరిగింది. ఇందుకు గాను జిల్లాలో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న తొలుత అంచనా వేశారు. ఈ మేరకు జిల్లా సహకార, మార్కెటింగ్, ఇందిరా క్రాంతిపథం, మెప్మా తదితర శాఖల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు జరుపుతున్నారు. దిగుబడులు తగ్గడం వల్ల కేవలం 3.50 లక్షల వరకే ధాన్యం కేంద్రాలకు రానున్నట్లు ప్రస్తుతం గుర్తించారు.

● జిల్లాలో కొనుగోళ్లు ఇలా..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 436 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరపాలని నిర్ణయించినప్పటికీ అవసరమైన ప్రాంతాల్లో 434 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 134 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 299 కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో ఒకటి కేంద్రాలను ఏర్పరిచారు. జిల్లాలో ఇప్పటివరకు 52,268 మంది రైతుల వద్ద నుంచి రూ.664.57 కోట్ల విలువ గల 2,86,632 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సేకరించిన ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి గానుగాడించడం కోసం మిల్లర్లకు పంపగా 2,50,759 మెట్రిక్ టన్నుల ధాన్యానికి ట్రక్‌షీట్ జనరేట్ అయింది. ఇందుకు గాను రూ.599.07 కోట్ల డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.



కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో లోడింగ్ చేస్తున్న కార్మికులు

● సన్న ధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటివరకు 3,365 మంది రైతుల వద్ద నుంచి 24,203 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 57.82 కోట్లు ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సన్నధాన్యానికి మార్కెట్‌లో ఆశించిన ధర రావడంతో రైతులు ఎక్కువగా ప్రయివేటులో విక్రయించారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత వారం, పది రోజులుగా సన్నధాన్యానికి మార్కెట్‌లో ధర పడిపోతుందని రైతులు అంటున్నారు. అయితే రానున్న వారం, పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు సన్నదాన్యం వచ్చే అవకాశాలున్నట్లు సివిల్‌సప్లయి శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

● ఇప్పటికే 61 కేంద్రాల మూత..

జిల్లాలోని పలు మండలాల్లో వంద శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసిన 61 కేంద్రాలను అధికారులు మూసివేశారు. ఇందులో 34 ఇందిరా క్రాంతి పథం కేంద్రాలు, ఒకటి మెప్మా కేంద్రం, 27 సహకార సంఘాల కేంద్రాలు మూతపడ్డాయి. ఈ కేంద్రాల్లో వంద శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయి. జిల్లాలో రానున్న వారం రోజుల్లో అన్ని కేంద్రాల్లో వంద శాతం కొనుగోళ్లు పూర్తవుతాయన్న అంచనాల్లో అధికారులున్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- సత్యప్రసాద్, కలెక్టర్



ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోళ్లు చేయడానికి సర్కారు సిద్ధంగా ఉంది. క్రిస్మస్ లోపు లేదా నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నాం.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

● బోనాలు సమర్పించిన భక్తులు -7లో..

ఘనంగా బోనాలు -7లో..

కరాటేతో ఆత్మరక్షణ -8లో..

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఈనెల 3న రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు నమిలికొండ సత్తయ్య(65) ఆదివారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని సత్తయ్య ఈనెల4న రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కిష్టునాయక్ తండాకుచెందిన యువకుడు గుగులోతు విజయ్ బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయలపాలైన వృద్ధుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, కొడుకులు బాబు, నర్సింలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వివాహిత ఆత్మహత్య



రచన(ఫైల్)

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతాలనికి చెందిన అడెపు రచన అలియాస్ జోగల హరి (27) అనే వివాహిత ఆదివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడెపు రచనకు మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ రాజేష్‌తో వివాహం జరిగినట్లు తెలిపారు. దంపతులకు కూతురు జన్మించిన తరువాత అత్తిం టి వారి వరకట్నం వేధింపులతో రచన కోరుట్ల పట్టణంలోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. ఈక్రమంలో రచన మల్లాపూర్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో అత్తింటి వారిపై ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచివెళ్లిన రచన అదేప్రాంతంలోని వ్యవసాయబావిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాట్లు వారు తెలిపారు. రచన తండ్రి అడెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుతపులి దాడిలో ఆవు మృతి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చిరుతపుడి దాడిలో ఆవు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లాండే సంతోష్ అనేరైతు రోజు మాదిరిగానే పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు కనబడలేదు. చుట్టుపక్కల వెతకగా ఆవు కళేబరంతోపాటు చిరుతపులి అడుగులను గుర్తించాడు. చిరుతపులి పొలం వద్దకు ఆవును ఎత్తుకెళ్లి చంపినట్లు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై అటవీశాఖ డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ లింగంపేట గ్రామంలోని కొత్తకుంట శివారులో ఆవుపై చిరుతపులి దాడి చేసింది వాస్తమేనని అన్నారు. పశువైద్యాధికారులతో ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేస్తామన్నారు.

ముక్కిన బియ్యం తిని గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

మల్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన దండిక మల్లేశం, తాడుక గంగన్నకు చెందిన 150 గొర్రెలు ముక్కిన బియ్యం తిని మృత్యువాత పడ్డాయి. శుక్రవారం నూకెల్లి సమీపంలో వ్యవసాయ పొలంలో పడేసిన ముక్కిన బియ్యం తినగా శనివారం, ఆదివారం మృతి చెందినట్లు బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా పశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు మృతి చెందిన జీవాలను పరిశీలించి నష్టం అంచనా వేశారు. నష్టపోయిన యజమానులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని వెల్దికి చెందిన పెంచాల సిద్ధార్థ రావు, మడ్డి రాకేష్ ఆదివారం తెల్లవారు జామున కరీంనగర్ నుంచి గ్రామానికి కారులో వెళ్తున్నారు. లింగాపూర్ శివారులో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి అదుపు తప్పి పక్కన ఉన్న చెటును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్‌కు రక్షణ.. సంచార్ సాథి

SANCHAR SAATHI MOBILE APP



- అనధికార సిమ్‌లు, నకిలీ కనెక్షన్లకు చెక్
- టెలికాం మోసాలకు అడ్డుకట్ట

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండడం మాములైపోయింది. ప్రతి నిత్యం సెల్‌ఫోన్‌లో అనధికార యాప్‌లతో సైబర్ మోసాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంచార్ సాథి యాప్ నకిలీలకు చెక్ పెడుతూ టెలికాం మోసాలకు అడ్డుకట్ట వేస్తోంది. ఒక పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో యాప్ ద్వారా తెలుసుకోవడమే కాకుండా మొబైల్ ఫోన్ పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేస్తుంది ఈ యాప్.

యాప్‌తో ప్రయోజనాలు

సంచార్ సాథి యాప్ ద్వారా ఒక వ్యక్తి తన పేరుపై ఉన్న సిమ్ కనెక్షన్ల వివరాలు తెలుసుకోవచ్చు. ఒక పేరుమీద ఆధార్ కార్డుతో ఎన్ని సిమ్‌లు రిజిస్టర్ అయ్యాయో తెలుస్తుంది. మొబైల్ ఫోన్ కంపెనీ వివరాలు అసలు, నకిలీ వివరాలు తెలుస్తాయి. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేసుకోవచ్చు. మొబైల్‌ను బ్లాక్ చేస్తే దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. అనుమానాస్పద కాల్స్ ఎస్ఎంఎస్‌లను యాప్‌లో రిపోర్టు చేయవచ్చు. మొబైల్‌కు భద్రత కల్పించే విధంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను అన్ని ప్రాంతీయ భాషల్లో ఉపయోగించవచ్చు. పోయిన ఫోన్ స్టేటస్‌ను తెలుసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

- మీ పేరు మీద ఉన్న సిమ్‌లను చెక్ చేసుకోవచ్చు. దేశంలో ఎక్కడైన మీ పేరు మీద ఉన్న సిమ్‌లు ఉన్నట్లయితే వాటి వివరాలు తెలుస్తాయి.
- పై మొబైల్ కనెక్షన్ మీద క్లిక్ చేయగానే మీ ఆధార్‌పై ఇతరులు తీసుకున్న సిమ్‌లు కనిపిస్తాయి. మీ పేరుమీద ఇతరులు సిమ్ తీసుకున్నట్లయితే రిపోర్టు, డిస్ కనెక్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే సిమ్‌పై వాడే నంబర్‌ను రద్దు చేయవచ్చు.
- ఫోన్ పోయినా, ఎవరైనా ఎత్తుకుపోయిన బ్లాక్, స్టోలెన్/లాస్ట్ డివైస్‌ను ఓపెన్ చేసి ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి ఎఫ్ఐఆర్ నంబర్‌ను అప్‌లోడ్ చేయాలి. 24 గంటల్లోపు పోయిన ఫోన్ నెట్‌వర్క్ బ్లాక్ అవుతుంది. ఫోన్ వాడకుండా, దుర్వినియోగం కాకుండా ఉంటుంది. ఫోన్ దొరికిన తర్వాత అన్‌బ్లాక్ డివైస్ ఆప్షన్‌ను ఎంటర్ చేస్తే తిరిగి పనిచేస్తుంది.

యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా...

గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో సంచార్ సాథి అని సెర్చ్ చేయాలి. డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. ఓటీపీని వెరిఫై చేసిన తర్వాత డాష్‌బోర్డులో కొన్ని ఫీచర్స్ కనిపిస్తాయి. మొబైల్ కనెక్షన్స్, రిపోర్ట్ ఫ్రాడ్ కాల్స్, ఎస్ఎంఎస్, బ్లాక్ డివైస్, చెక్ లాస్ట్, ఫోన్ స్టేటస్, ట్రేస్ ఐఎంఈవో వంటి ఫీచర్లు ఉంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఓఎస్‌డీ ప్రభాకర్

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో ఆదివారం భారీఎత్తున రేషన్ బియ్యం పట్టుకున్నారు. హుజూరాబాద్‌లో రేషన్ బియ్యం అక్రమరవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు సివిల్‌సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఏర్పాటుచేశారు. పట్టణంలోని బోర్నపల్లి శివారులోని ఓ రైస్‌మిల్లుకు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు దాడులు నిర్వహించారు. ఒక్కో ఆటోలో మూడు క్వింటాళ్ల చొప్పున ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ రైస్‌మిల్లులో తనిఖీచేయగా సుమారు 320 క్వింటాళ్ల పీడీఎస్ లూస్‌రైస్‌ను గుర్తించారు. ఈసందర్భంగా సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలోని పలుగ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ 12రూపాయలచొప్పున రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఎడ్ల రమేష్ అనే దళారికి విక్రయిస్తున్నారన్నారు. రమేష్ చెప్పడంతోనే రేషన్‌బియ్యాన్ని మిల్లుకు తరలిస్తున్నట్లు ఆటోయజమానులు పేర్కొన్నారన్నారు. బియ్యాన్ని రేషన్ స్టాక్‌పాయింట్‌కు తరలించామని, రైస్‌మిల్లు యజమాని, దళారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడుల్లో అధికారులు లక్ష్మారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'నవోదయ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కేవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధుకృష్ణ, ట్రెజరర్‌గాశ్రీనివాస్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంకమండలం జంగంపల్లి(కోర్కల్) గ్రామానికి చెందినరావణావేణిసాగర్ ఇసుకరవాణా చేస్తున్నట్లు, అతడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటలోని మడిపల్లి రైల్వేగేటు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. వీణవంక మండలానికి చెందిన నవీన్, రవిని అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు, డ్రైవర్ పప్పుకృష్ణపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాచర్లగొల్లపల్లిలో చోరీ



బీరువాను ధ్వంసం చేయడంతో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భానుచందర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. లోనికి చొరబడిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి వస్తువులను చిందరవందరగా పడేశారు. రూ.10 వేల నగదు, విలువైన పత్రాలతో పాటు రూ.80 వేల విలువైన 2 ట్యాబ్‌లు, 3సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. భానుచందర్ ఇంటికి తాళం వేసి రెండు రోజుల కిందట తన కుటుంబ సభ్యులతో కలిసి సిరిసిల్ల వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తాళం తీసి కనిపించింది. ఇంటిలోని బీరువాను ధ్వంసం చేయడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రణల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. వేసిన తాళం పగులకొట్టకుండా తీసి చోరీ చేయడం పట్ల పోలీసులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లె గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో నుంచి టిప్పర్‌లో మొరం నింపుకొని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పెద్దూరు బస్టాండు వద్ద పట్టుకొని సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నిందితులు ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేట గ్రామానికి చెందిన బోల్లి ప్రవీణ్, సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన మామిండ్ల జగన్‌లపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రుద్రంగి చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. రుద్రంగి నుంచి దెగవాత్ తండా గ్రామానికిచెందిన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేల విలువగల మద్యం తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వంశీ, హెడ్‌కానిస్టేబుల్ పద్మారావు తదితరులు ఉన్నారు.



ఇల్లందకుంటలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు

ఇల్లందకుంట : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వ ఉంచినా కేసులు తప్పవని ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికిచెందిన చిప్ప మనోజ్ రూ.11080విలువగల మద్యాన్ని ఇల్లందకుంట మండలం నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్‌చేసి, మనోజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా పట్టివేత

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, రాచర్లగొల్లపల్లి గ్రామా ల్లో 2లీటర్ల సారా, రూ.2838 విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సారా తయారుచేస్తున్న రజిత, మద్యంవిక్రయిస్తున్న షేక్‌మౌలానాపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లఘించి సారా, మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



రుద్రంగి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న మద్యం బాటిళ్లు

శభాష్ పోలీస్..

- సామాజిక సేవలో పోలీసులు
- రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చివేత



రోడ్లపై గుంతలు పూడ్చుతున్న పెద్దపల్లి రూరల్ పోలీసులు(ఫైల్)

మంథని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రహదారులపై గుంతలను పూడ్చుతూ మంథని పోలీసులు ప్రజలచే శభాష్ అనిపించుకుంటున్నారు... ఇటీవల వరుసగా జరగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసులు దృష్టిసారించారు. పలుచోట్ల బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. రోడుపై గుంతలతో వాహనాలు అదుపు తప్పి కిందపడి మరణాలు, గాయాల పాలవుతున్నారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు నిమగ్నమవుతూనే.. మరోవైపు సామాజిక బాధ్యతగా సేవలందిస్తున్నారు. దాదాపు 10ఏళ్లక్రితం నిర్మించిన మంథని-గోదావరిఖని 26 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తారు. పలు ప్రాంతాల్లో రోడ్డు మధ్య భాగాల్లో, ఇరువైపులా పక్కన గుంతలు పడ్డాయి. రోడ్డు పై లోతుగా, వెడల్పుగా పడిన గుంతల కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చి వీటిలో పడి ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఎన్నికల డ్యూటీలో భాగంగా మంథని ప్రాంతానికి వస్తున్న క్రమంలో గుంతలు గమనించి వీటి పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని మంథని ఎస్ఐ డేగ రమేష్‌ను ఆదేశించారు. దీంతో సిబ్బందితో ఆటో ట్రాలీలో మట్టి, కంకర నింపుకొని వెళ్ళి మంథని -గోదావరిఖని ప్రధాన రహదారిపై పలు చోట్ల ఉన్న గుంతలను పూడ్చి వేయించారు. ప్రమాదాల నివారణ కోసం సామాజిక బాధ్యతగా గుంతలు పూడ్చిన మంథని పోలీసులను ఏసీపీ రమేష్ అభినందించారు.

పెద్దపల్లి - ధర్మారం వెళ్లే రహదారిలో..

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి-ధర్మారం వెళ్లే రహదారిలో అడుగుకో గుంత ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీస్‌ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లిరూరల్ ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలు లేకుండా పూడ్చివేశారు. గత నెల16న కాసులపల్లి శివారులో ధర్మారం మండలం బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్ కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి వాహనం అదుపు తప్పడంతో సాయిపావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమదాలను నివారించేందుకు గాను పెద్దపల్లి పోలీస్ అధికారులు ముందుకొచ్చారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లి - ధర్మారం వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్ఐ సిబ్బందితో గుంతలను గుర్తించి పూడ్చి వేయించారు.

అతి వేగం ప్రమాదకరం

- మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



వాహనదారులు వాహనాలను అతి వేగంగా నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయి. ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపరాదని, హెల్మెట్ ధరించాలి. లారీలు, ట్రాక్టర్లు ఓవర్ లోడ్‌తో వెళ్లడం ద్వారా రోడ్లు గుంతలుగా మారుతున్నాయి. ప్రతి ఒక్కరూ గమనించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

దాడి ఘటనలో భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని భార్యాభర్తలు సుంకరి ప్రమీల, రాజమల్లుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. గ్రామంలోని సుంకరిమల్లయ్య పేరిటఉన్న 1.13ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడని చెప్పారు. ఆ భూమిలో తనకు వాటా ఉందని పేర్కొంటూ అతని సోదరుడు రాజమల్లు, మరదలు ప్రమీలలు ఈనెల6న మల్లయ్య ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి దాడికి దిగారని తెలిపారు. బాధితుడి మల్లయ్య భార్య అమృతవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మహిళ తోకల లక్ష్మణ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని తోకల నవీన్ 2017లో లక్ష్మణను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కొడుకు, కూతురు ఉన్నారు. లక్ష్మణ ఇంటి వద్ద బీడీలు చుడుతూ జీవిస్తోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరాతీశారు. ఆచూకీ లభించకపోవడం వల్ల నవీన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

కుంగిపోతున్న పండుటాకులు

- పిల్లల ఆదరణ కరువు
- చివరి దశలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వృద్ధులు



వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరూ ఉన్నా కొందరు వృద్ధులు అనాథలుగా మిగులుతున్నారు. కన్నబిడ్డలను కంటికి రెప్పల కాపాడి ప్రయోజకులను చేస్తే రెక్కలు వచ్చిన తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు ఆస్తుల కోసం వేధింపులకు పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పాల చూసుకోవాల్సిన కొందరు పట్టించుకోవడం లేదు. ఆస్తుల కోసం వేధింపులకు గురిచేయడం, తిండి పెట్టకపోవడం, చేయి చేసుకోవడం చివరకు చంపేందుకు వెనకాడకపోవడం వంటి ఘటనలు కుంగిపోయేలా చేస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పిల్లలను పెంచి ప్రయోజికులను చేస్తే వృద్ధాప్యంలో పట్టెడన్నం పెట్టాకుండా మనోవేదనకు గురి చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. కొంతమంది ఇంటినుంచి వెళ్లిపోతున్నారు. మరి కొంత మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో మండలంలో తరచూ వృద్ధుల బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. మండలంలోని నర్సింగాపూర్‌లో వృద్ధ దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. మండలంలో ఏడాదిగా పలు గ్రామాల్లో వృద్ధుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి.

చట్టాలున్నా అవగాహన లేక ఇబ్బందులు..

పండుటాకులకు సొంతబిడ్డల నుంచే వేధింపులు, నిరాదరణ ఎదురవుతుండడంతో కేంద్రం2007లో తల్లి దండ్రులు, వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చింది. రెవెన్యూ డివిజన్‌స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వృద్ధులు తమ పేరిట ఉన్న ఆస్తులను పూర్తిగా పిల్లలకు రాసి ఇచ్చాకపట్టించుకోక పోవడంతోపాటు వారిని ఇబ్బంది పెడుతు న్నారు.

అల్ట్రా మారథాన్ ఈవెంట్‌లో పాల్గొన్న సిరిసిల్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్



ఈవెంట్‌లో పాల్గొన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ అనిల్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్- జైసల్మేర్ నుంచి లాంగెవాలా వరకు నిర్వహించిన ది బోర్డర్-2025 వంద కిలో మీటర్ల అల్ట్రా మారథాన్ రన్‌లో సిరిసిల్లజిల్లాకు చెందిన అర్మ్‌డ్ రిజర్వ్ కాని స్టేబుల్ అనిల్ యాదవ్ పాల్గొన్నారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎడారి ప్రాంతంలోని వేడి, చలి తీవ్రత, ఎత్తైన ఇసుక మేటల వంటి సవాళ్ల మధ్య వంద కిలోమీటర్ల పొడవునా సాగిన ఈ రన్‌ను కాని స్టేబుల్ అనిల్ యాదవ్ 14గంటల్లో పూర్తిచేశారు. ఇటువంటి అల్ట్రా మార థాన్ ఈవెంట్‌లో పాల్గొని ఫోర్స్‌లోని యువసిబ్బందికి ఆదర్శంగా నిలిచిన అనిల్ యాదవ్‌ను ఆదివారం ఎస్పీ మహేష్ బీ గీతే అభినందించారు.

భీమన్న సన్నిధిలో నటి ఐశ్వర్య రాజేశ్ పూజలు



భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 'సంక్రాంతికి వస్తున్నాం' హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ఇంటి నుంచి ఓటు లేనట్లే..

- అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- పంచాయతీ ఎన్నికల్లో స్పష్టత కరువు



ఇంట్లో ఓటు వేస్తున్న వృద్ధురాలు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రెండేళ్ల క్రితం నిర్వహించిన శాసన సభ, లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. నడవలేని, చేతగాని, మంచానికే పరిమితమైన వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వెళ్లలేక పోవడంతో వారు తమ ఓటు హక్కును వినియో గించుకోలేకపోతున్నారు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గుతోంది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం అటువంటి వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాత్రం అలాంటి అవకాశం ఇవ్వలేదు. సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కోసం ఎదురుచూ స్తున్నా ఎన్నికల సంఘం నుంచిఅలాంటి ప్రకటన రాలేదు.

● గత ఎన్నికల్లో ఇలా

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు జాబితాలో పేరుండి 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 45 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ప్రత్యేకంగా 12-డీ ఫారాన్ని ముందస్తుగానే నింపి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. వారు ఇచ్చిన అడ్రస్‌కు పూర్తి స్థాయి భద్రత, పోలింగ్ సామగ్రితో వెళ్లి అధికారులు ఓటు వేయించారు.

● ఇబ్బందులు పడే అవకాశం

ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికలో ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు కచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. పోలింగ్ సమయం కూడా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటుంది. నిర్ణీత సమయం లోపు కుటుంబ సభ్యులు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించాలి. కాదూ అని వారిని వదిలేస్తే ఓటింగ్ శాతం తగ్గి గెలుపు, ఓటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతోపాటు ఓటర్లు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

వృద్ధులకు అవకాశం కల్పించాలి..



- కరిమిండ్ల దేవయ్య, కనుకులగిద్దె.

నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా అధికారులు అవకాశం కల్పించాలి. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాంటి వారిని అధికారులు గుర్తించి అవకాశం కల్పించాలి.

లైన్‌లో నిల్చోలేం..



-దార రాధమ్మ, జూపాక

పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లి గంటల తరబడి అక్కడ నిలబడలేం. అంత దూరం నడుచుకుంటూ వెళ్లాలన్నా ఇబ్బందే. అధికారులు స్పందించి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించాలి.

భీమన్న సన్నిధిలో అభివృద్ధి పనులు పరిశీలన

● అధికారులకు పలు సూచనలు చేసిన విప్ ఆది శ్రీనివాస్



ఆలయంలో భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వరస్వామిని ప్రభుత్వవిప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి భక్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కోడె క్యూలైన్లు, సిసి రోడ్డు, క్యూలైన్ ఫ్లైఓవర్, ఉచిత దర్శనం క్యూలైన్, ప్రత్యేక దర్శనం క్యూ లైన్, వీఐపీ రోడ్డు, పార్వతీపురం ధర్మశాల రోడ్డు, లడ్డు కౌంటర్, అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపులు పలు ప్రదేశాలను పరిశీలించారు.

రైల్వే గేట్ వద్ద రహదారిపై గుంతలు

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పూడూర్ రైల్వే గేట్ దగ్గర రహదారిపై ఏర్పడిన గుంత

కొడిమ్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ రైల్వేగేట్‌కు సమీపంలో రోడ్డుపై ఇరువైపులా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పూడూర్ గ్రామం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్నది. కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి, కథలాపూర్, కోరుట్లకు చెందిన వారు కరీంనగర్‌కు వెళ్లాలంటే మండలకేంద్రంనుంచి అప్పారావుపేట, పూడూర్ గ్రామాల మధ్యఉన్న పూడూర్ రైల్వే గేట్‌పైనుంచి రాకపోకలు సాగిస్తుంటారు. జగిత్యాల నుంచి వేములవాడకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రైల్వేగేట్‌కు ఇరువైపులా ఏర్పడిన గుంతలను సంబంధిత అధికారులు పూడ్చి వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవులు సబ్బని లక్ష్మీనారాయణ, సంకెపెల్లి నాగేంద్రశర్మ ఆంగ్లంలో రచించిన కథల సంకలనం స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్ భాస్కర ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కథా సంకలనాన్ని యుకియోటో అంతర్జాతీయ ప్రచురణల సంస్థ ప్రచురించింది. ఇందులో అఖిల భారత స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 18మంది కవుల, రచయితల కథలు, కవితలు కూడా ఉన్నాయి. ఈసందర్భంగా కరీంనగర్ అరబిందో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, సాయినగర్ వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ రాజు, ఎస్ సురేందర్‌రెడ్డి, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కేవీ సంతోష్ బాబు, పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిందం రమేశ్, వెల్మల జయపాల్‌రెడ్డి, బొమ్మ కల్ రైతుసంఘం నాయకుడు కె నారాయణ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

పైపులైన్ లీకేజీకి.. మరమ్మతు చేయరూ..



జగ్గయ్యపల్లిలో రోడ్డు పక్కన లీకవుతున్న పైప్‌లైన్

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథా అవుతోంది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారి జగ్గయ్యపల్లిలోని రోడ్డు పక్కన తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్య ఏర్పడింది. దీంతో నీరు కలుషితమవుతోందని, వృథాగా పోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మరోవైపు పైపులైన్ మరమ్మతు కోసం గుంతను తవ్వి వదిలేశారు. గుంత రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనం రోడ్డు పక్కకు దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, పైపులైన్‌కు మరమ్మతు చేపట్టాలని, గుంతను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరీంనగర్ చిత్రకారుడికి అభినందనలు



మహానటి సావిత్రి కూతురు విజయ ఛాముండేశ్వరికి సావిత్రి చిత్రాన్ని అందజేస్తున్న రాపర్తి వెంకటేశం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన నంది అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు, రంగస్థల కళాకారుడు, గాయకుడు రాపర్తి వెంకటేశంను మాజీ రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మహానటి సావిత్రి కుమార్తె విజయ ఛాముండేశ్వరి అభినందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం రాత్రి సావిత్రి 90వ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడికి, విజయఛాముండేశ్వరికి వెంకటేశం తన స్వహస్తాలతో గీసిన వారి చిత్రపటాలను బహూకరించారు. కరీంనగర్ కళాకారుడికి ఓ గొప్ప కళావేదికపై అరుదైన గౌరవం దక్కిందని రాష్ట్ర విశ్రాంతప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కరీంనగర్ యూనిట్ సభ్యులు, పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర



గొల్లపల్లిలో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



మెట్లచిట్టాపూర్‌లో బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. భక్తులు బెల్లంపానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకొని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో గర్భ గుడిలోకివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలువేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల మల్లన్ననామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.1,75,400ఆదాయం సమకూరినట్లు ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులకు అసౌకర్యం కల్గకుండా ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు ఉచిత సేవలను అందించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్‌రెడ్డి, జగిత్యాల టౌన్‌ఎస్సై

● బోనాలు సమర్పించిన భక్తులు

రవికిరణ్, సీసీఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జాతర ఉత్సవాలను ఏఎంసీచైర్మన్ భీమసంతోష్, ఆలయఈవో విక్రమ్, ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

● మెట్లచిట్టాపూర్‌లో ఘనంగా బోనాలు..

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో శ్రీమల్లికార్జున బోనాలపండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డితోపాటు గ్రామాభివృద్ధికమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని ప్రజలు ఇంటికి ఒకబోనంను భక్తిశ్రద్ధలతోచేసి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బోనంతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి నాయకులు కుంట జనార్దన్, మింగస్వామి, పెంట హిమాకర్, తేలు శేఖర్, దువ్వాక మురళి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

● గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ..

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులరద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరినదికిభారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరినదిలో స్నానాలు చేశారు. నదీజలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి పూజించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు చాంపియన్‌షిప్



చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడిజిల్లా బాలురజట్టు చాంపియన్‌షిప్ గెలుచుకుంది. బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. మహబూబాబాద్ జిల్లా కురవిలో ఈనెల 4నుంచి 6వరకు 69వ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-14 బాలికలజట్టు తృతీయస్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో ఈనెల 16నుంచి 19వ తేదీవరకు జరిగే అండర్-17 జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడిజిల్లా సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి గను విజయబాస్కర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులను జిల్లాయువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, సెపక్‌తక్రా కోచ్‌లు కుమార్, శ్రీనివాస్, సుమాన్, శ్రీకాంత్ అభినందించారు.

కేంద్ర నిధులతో ఏకగ్రీవ గ్రామాల అభివృద్ధి

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



పీచుపల్లి సర్పంచును సన్మానిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రనిధులతో ఏకగ్రీవ గ్రామా లను అభివృద్ధి చేస్తామని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన పీచుపల్లి, విజయ్‌నగర్‌కాలనీ సర్పంచులు సామ రాజిరెడ్డి, అమూల్య రాజశేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలకు పదిలక్షల ప్రోత్సాహక నిధులు ఇస్తానన్నారు. కోహెడ సర్పంచ్‌గా ఎన్నికైన అమూల్య రాజశేఖర్ తనవంతుగా గ్రామ అభి వృద్ధికి రూ.9లక్షలు ఇస్తామనడం అభినందనీయమన్నారు. త్వరలోనే ఏకగ్రీవ మైన గ్రామాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు



భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తులుపోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జితసేవల్లో పాల్గొన్నారు. కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజరాజేశ్వర స్వామివారిని ఎల్‌ఈడీస్క్రీన్‌లో దర్శించుకున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతోరద్దీగా మారింది. భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో స్వామి వారికి అభిషేకం

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ మంత్రోచ్చర ణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ప్రముఖ పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 21 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం వారికి మందులు , కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు చెట్‌పెల్లి సుధాకర్, జుంబర్తి శంకర్, రాజేశ్వర్ రెడ్డి, ములాసపు మహేష్, కొలగాని సత్యం, సునేష్, శరత్ రావు, ప్రభాత్ సింగ్ ఠాకూర్, ఏనుగుల రాజు, వంశీ బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

కోరుట్ల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో ఈనెల 9వ తేదీ నిర్వ హించే 16వ క్యాంపస్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కళాశాల కరస్పాండెంట్ ప్రవీన్ కుమార్ ఆదివారం తెలిపారు. డిగ్రీ 55 శాతం కలిగి ఉండి 26 సంవత్సరాల వయసు నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. కళాశాలలో చదివి విద్యార్థులే కాకుండి ఇతర కళాశాలకు చెందిన వారు కూడ ప్లెస్మెంట్ డ్రైవ్ ప్లెస్‌మెంట్‌లో అర్హత ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయత్రం వరకు క్యాపంస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌లో రిజస్టేషన్ కొరకు 932 182 5562 నంబర్‌కు సంప్రదించాలని మిగితా వివరాల కొరకు కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ కళాశాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

రేపు వేలం

కొడిమ్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో పట్టెనామాలు, మరియు కోరమీసాలు అమ్ముకొను హక్కు పొందుటకు ఈ నెల 9న మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. 2026 జనవరి 27 నుండి ఫిబ్రవరి 2, 2026 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు పట్టె నామాలు, కోరమీసాలు అమ్ముకొనుటకు హక్కు పొందుటకు గాను 1లక్ష రూపాయల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

కొడిమ్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రంగోత్సవ్ సెలబ్రెషన్ సంస్థ నిర్వహణలో జాతీయ స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్, కలరింగ్ పోటీలలో కొడిమ్యాల మండలంలోని పూడూర్ మానేరు ఉన్నత పాఠశాల నాల్గవ ర్యాంక్ సాదించినట్లు ఆర్ట్ టీచర్ రామానుజాచారి ఆదివారం తెలిపారు. ఆర్ట్ టీచర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ పోటీలలో 30మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, 18మంది సిల్వర్ మెడల్స్ 8మంది బ్రాస్ మెడల్స్ పొందగా ఒక్కరు ప్రత్యేక బహుమతిని పొందినట్లు వివరించారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన విద్యార్థులకు మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ సునితారెడ్డి, ప్రిన్సిపాల్ అశ్విన్ అభినందనలు తెలిపారన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

-రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని ఉద్యానవన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగుతో ప్రకృతి వైపరీత్యాల వలన ఎటువంటి నష్టం వాటిల్లదని పేర్కొంటున్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి రైతులకు వివరిస్తున్నారు. కోతులు, పక్షుల బెడద ఉండదని ప్రచారం నిర్వహిస్తూ ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.



ఆయిల్ పామ్ తోట

● నీటి వినియోగం తక్కువ

-ఆయిల్ పామ్ సాగుకు నీరు నిల్వ ఉండని అన్ని రకాల నేలలు అనుకూలం.

-ఒక ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చు.

-ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 14నెలల నుంచి 18 నెలల తర్వాత పూతకు వస్తాయి.

-పరాగ సంపర్కం "ఎలడోబియస్ కామెరూనకస్" అనే కీటకాల ద్వారా జరుగుతుంది.

-మొదటి కోత నాటిన 36 నెలల తర్వాత ప్రారంభం అవుతుంది.

-ప్రతి 45 రోజుల నుంచి 60 రోజులకు ఒకసారి ఆయిల్ పామ్ కాయలు కోతకు వస్తాయి.

● సాగుకు సబ్సిడీలు

-ఒక మొక్క ఖరీదు రూ.193 ఉండంగా రైతు రూ.20 చెల్లించి మొక్కను పొందవచ్చు.

-ఒక ఎకరానికి 57 మొక్కలు నాటాలి.

-డ్రిప్ ఇరిగేషన్ పైన రైతు యొక్క భూమిని బట్టి 80 శాతం, 90 శాతం, 100 శాతం సబ్సిడీ ఉంటుంది.

-ఎస్సీ, ఎస్టీ రైతులు డ్రిప్ కోసం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది.

-పెట్టుబడి సహాయం కింద ఒక ఎకరానికి అంతర పంటల నిర్వహణకు రూ.2100. ఆయిల్‌పామ్ సాగుకు రూ.2100 చొప్పున మొత్తం ఎకరానికి రూ.4200 రైతుల ఖాతాలో జమ చేస్తారు.

-ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు 4 సంవత్సరాల వరకు పెట్టుబడి సాయం అందుతుంది.

-ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వమే ధర నిర్ణయిస్తుంది. ప్రతి 12 నెలలకు ఒకసారి కోతకు రావడం వలన రైతులకు నిరంతర ఆదాయం వస్తుంది.

- దళారి వ్యవస్థ లేకుండా రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు పడే అవకాశం ఉంది.

- ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కోకో, వక్క వంటివి నాటడం వల్ల ఒక సంవత్సరానికి 1 ఎకరంలో రూ.3లక్షల నుంచి 4 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు.

సాగుపై రైతులను చైతన్యపరుస్తున్నాం

-అన్వేష్, ఉద్యానవన మండల అధికారి, కోరుట్ల



ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో చైతన్యం నింపుతున్నాం. ప్రభుత్వాలు అందించే సబ్సిడీలతో పాటు వచ్చే లాభాలను మండల రైతులకు వివరిస్తున్నాం. రైతులకు అందించే పంట సహాయం వివరిస్తూ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

మహా శివుడికి అభిషేకాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాల టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా శివుడికి భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం అయిన మార్గశిర మాసం బహుళ ఆరుద్ర నక్షత్రం రావడంతో భక్తులు స్వహస్తాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు సూరోదయానికి పూర్వం తెల్లవారు జాము 3 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కొనసాగాయి. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రంలో పరమ శివుడికి అభిషేకాలు నిర్వహిస్తే మహా శివరాత్రి, మాస శివరాత్రుల్లో అభిషేకం చేసిన ఫలితం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిగుళ్ల విషశర్మ,అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి

కోరుట్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కొరారు. కోరుట్ల మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీ మద్దతు పలుకున్న అభ్యర్థులను బారీ మెజారీతో గెలిపించాలని కొరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'కరాటే శిక్షణతో ఆత్మరక్షణ'

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కరాటే శిక్షణతో ఏకాగ్రత, ఆత్మరక్షణ సిద్దిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో పవన్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో 2వ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హర్యానా స్పోర్ట్స్ పాలసీని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని, ఆత్మవిశ్వాసంతో మరింత ముందుకు సాగాలన్నారు. సీఎం, కరాటే రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి కరాటే సమస్యలు, చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలుపై విజ్ఞప్తి చేసి, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగిలి, రాజిరెడ్డి, కూసరి అనిల్, కోటేశ్వర్‌రావు, వంశీబాబు, కరాటే మాస్టర్‌లు లింగన్న, శ్రీనివాస్, ఆరుముల్ల పవన్, గంగాధర్ తదితరులున్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆదివారం రాత్రి సందర్శించారు. ఆలయం పక్షాన సాంప్రదాయం ప్రాకారం ఆయనకు అర్చకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్, ఎస్ఐ మహేష్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సంక్షేమానికి చర్యలు

జగిత్యాల టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలో 9 మంది మున్నూరుకాపు సభ్యులకు కౌన్సిలర్ అవకాశం ఇచ్చి గెలిపించుకున్నామని ఆయన అన్నారు. జగిత్యాల పట్టణం హనుమాన్ వాడలోని బీరయ్య గుడి సమీపంలో నిర్మించిన శ్రీ హనుమాన్ మున్నూరు కాపు సేవ సంఘం నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవ చేయడం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఎన్నికల్లో తనకు పోచమ్మవాడ, హనుమాన్ వాడ ప్రజలు మెజారిటీ అందించారని అన్నారు. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని, పట్టణం నలువైపుల కూరగాయల మార్కెట్‌లు అభివృద్ధి చేయడం జరిగిందని, రైతులకు చాల ఉపయోగకరంగా మారిందన్నారు. పట్టణంలో ప్రతివార్డులో సిసి రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి కౌన్సిలర్‌లు తోట మల్లికార్జున్, కూతురు పద్మ శేఖర్, కూసరి అనిల్, కూతురు రాజేష్, సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు సుధాకర్, బూసి వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులు జున్ను సంతోష్, శేఖర్, సంఘం బాధ్యులు తిరందాస్ లింగారెడ్డి, మదుకర్, తిరందాస్ శంకర్, బూసి శంకర్, జిలకర నారాయణ, లింగారెడ్డి, శ్రీనివాస్, బూసి వజయ్, మణి, కూతురు నరేందర్, సంఘం కార్యవర్గ సభ్యులు, నాయాకులు తదితరులు పాల్గొన్నారు.

మాజి మంత్రి టి. జీవన్‌రెడ్డి, మాజి జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌లు మున్నూరు కాపు సంఘ భవన ప్రారంభోత్సవంలో పాల్గొని సంఘ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కోన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



ఎక్స్‌కావేటర్‌తో అక్రమంగా తోడుతున్న మట్టి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామశివారులోని ఎస్సారెస్పీ కెనాల్ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని ఆదివారం తరలించుకుపోతున్నారు. వారు యథేచ్ఛగా అధికారులు అనుమతి ఇచ్చినట్లుగానే భావించి, మట్టిని ఎక్స్‌కావేటర్‌తో తవ్వుకుంటూ ట్రాక్టర్లు, లారీల్లో తరలించుకుపోతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంను గండి కొడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోరుట్ల సీఐ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని మోహన్‌రావుపేట, చిన్న మెట్‌పల్లి, మాదాపూర్, సంగెం, నాగులపేట గ్రామాలలో కోరుట్ల సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ ఎస్ఐలు చిరంజీవి, రామచంద్రుడు, నవీన్, శ్రీధర్ రెడ్డిలు వారి సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ బాబు మాట్లాడారు. గ్రామస్థులు ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో అపరిచితులచే అప్ర మత్తంగా ఉండాలన్నారు.



మోహన్‌రావుపేటలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

● ఇబ్రహీంపట్నం: ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించు కోవాలని మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్ గ్రామస్తులకు పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని ఇబ్రహీంపట్నం, ఎర్దండి, వర్షకొండ గ్రామాల్లో పోలీసులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని, ప్రజలు, ఆయా పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, మల్లాపూర్ ఎస్ఐ రాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలలో ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని సీఐ అనిల్ కుమార్ హెచ్చ రించారు. ఆదివారం మండలం లోని జగ్గసాగర్, వెల్లుల్ల గ్రామాల్లో పోలీసు సిబ్బందితో కవాత నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అనిల్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఎన్నికలు శాంతి యుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు సన్నద్ధంగా ఉన్నరన్నారు.

ప్రతి ఒక్కరు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ అనిల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎత్తురా జెండా' పాట ఆవిష్కరణ


రాయికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో యువత రాజకీయంలోకి రావాలనే ఉద్దేశ్యంతో వేణు రచించిన ఎత్తురా జెండా పాటను జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ఆదివారం ఆవిష్కరించారు. యువత రాజకీయంలోకి రావాలనే పాటను రచించడం అభినంద నీయమని అన్నారు. కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షుడు ఏలేటి అనిల్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఉదయశ్రీ, రాణి సాయికుమార్, కో ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సాయికుమార్, మహేష్ గౌడ్, మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించాలి'

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతులు పలికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని వేంపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం, కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

● ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ పార్టీ తరపున బలపరుస్తున్న అభ్యర్థులను భారీ మెజారిటితో గెలిపించుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గ్రామస్తులను కోరారు. ఆదివారం మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

● కోరుట్ల రూరల్: బీఆర్ఎస్ పార్టీ బలపరుస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు కోరారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో బీఆర్ఎస్ మద్దతు పలుకుతున్న అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు.



ఓటర్లకు గాలం

(5వ పేజీ తరువాయి)

కోతలు పూర్తి చేసుకున్న రైతులు నారు పోయడం, ముందస్తుగా నారు పోసుకున్న రైతులు నాట్లు వేయడం వంటి పనులు చేస్తున్నారు. దీంతో రైతులను, వ్యవసాయ కార్మికులను కోడి కూత సమయాని కంటే ముందు నిద్రలేపి మరీ ఓట్లు వేయాలని నాయకులు అభ్యర్థిస్తుండడం విశేషం. ఉదయం పూట ఓటర్ల వద్ద నుంచి హామీ తీసుకుంటే తప్పకుండా ఓటు వేస్తారని అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులు, వ్యవసాయ కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థిస్తుండడం జరుగుతోంది. అభ్యర్థులు ప్రచారాల్లో వ్యవహరిస్తున్న వ్యూహాలు ఎన్నికల్లో ఏమేరకు ఫలితాలను అందిస్తాయో మరి.

చింతలూరులో వరుసగా ఆరుసార్లు ఏకగ్రీవమే..



చింతలూరు గ్రామం

రాయికల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం చింతలూరు గ్రామ పంచాయతీ గతంలో వరుసగా ఆరుసార్లు 2014 వరకు ఏకగ్రీవం అయ్యింది. 2019లో తొలిసారి గ్రామస్థులు ఓటు వేసి అనుపురం శ్రీనివాస్ అనే వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఈసారి జరగనున్న ఎన్నికల్లో 14వ తేదీన ఓటర్లు రెండవసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గతంలో ఆరు సార్లు పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. బోర్నపల్లి గ్రామానికి అనుబంధంగా ఉన్న చింతలూరు 1981లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. అదే ఏడాది తొలి సర్పంచ్‌గా బషీర్‌పల్లెకు చెందిన బంద్రీ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికై 1988 వరకు పదవిలో ఉన్నారు. 1988, 95 ఎన్నికల్లో అనుపురం లింబాగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 2001లో ఓరుగంటి మోహన్ రావు, 2006లో లక్ష్మానాయక్, 2014లో కదుర్ల లక్ష్మి సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2019లో తొలిసారి గ్రామస్థులు ఓటు వేసి అనుపురం శ్రీనివాస్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఏడు పర్యాయాలు ఎన్నికలు జరుగగా, ఆరుసార్లు ఏకగ్రీవం కావడం విశేషం.

అభ్యర్థి నచ్చక పోతే.. 'నోటా' ఉందిగా

వెల్గటూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఎలా? తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. అభ్యర్థులు ఎవరు నచ్చకపోయినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేలా ఎన్నికల సంఘం 'నోటా' (నన్ ఆఫ్ ద ఎబో)ను ప్రవేశపెట్టింది. 2013 వరకు అభ్యర్థులు నచ్చకపోయినా, సరైన అభ్యర్థి పోటీలో లేరని భావించినా ఓటర్లకు ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేది. 2013 సెప్టెంబరు 27న దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో నోటా అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం మొదటి సారి ఢిల్లీ, రాజస్థాన్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో ఈవీఎంలలో నోటా మీట ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించింది. అప్పటి నుండి ప్రతీ ఎన్నికల్లో ఈవీఎం లలో నోటా మీటా ఉంటోంది. కాగా రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థల (ఎన్నికల నిర్వహణ)లో నియమావళిలో కూడా దీన్ని పొందుపరిచారు. దీనిని అనుసరించి ప్రస్తుతం బ్యాలెట్ విధానంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కూడా బ్యాలెట్ పత్రంలో చివరి చిహ్నం నోటా ఉంటోంది. ఓటర్లకు అభ్యర్థులు ఎవరూ నచ్చకపోయినా నోటాకు ఓటు వేసి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఫ్లెక్సీల జోరు.. మైకుల హోరు

మల్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ సారి పంచాయితీ ఎన్నికల్లో గతంలో లేని విధంగా సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. తమ గుర్తులతో ముద్రించిన ఫ్లెక్సీలను కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల ఫ్లెక్సీలతో కలర్‌ఫుల్‌గా మారుతుంది. ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మాత్రమే వినియోగించిన వాహనాలకు గుర్తుల ఫ్లెక్సీలతో మైక్‌లు ఏర్పాటు చేసి గ్రామాల్లో తిప్పుతున్నారు. దీంతో గ్రామాల్లో మైకుల మోత నెలకొంది.

● 'గుర్తు'ంచుకునేలా..

సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు శనివారం గుర్తులు కేటాయించడంతో ఆదివారం నుంచి తమ గుర్తులు తెలుపుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు ఉంగరం, బ్యాట్, కత్తెర, స్టూల్, గౌన్, సిలిండర్, సిలిండర్ పొయ్యి తదితర గుర్తులు కెటాయించడంతో వాటిని ప్రదర్శిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఉంగరం గుర్తు వచ్చిన అభ్యర్థులు మార్కెట్‌లో లభించే ఉంగరాలు కొనుగోలు చేసి ఒక్కోక్కరికి అందిస్తూ గుర్తుంచుకొని ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

నాడు ఉప సర్పంచ్.. నేడు సర్పంచ్

కొడిమ్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చింతల్లపల్లి గ్రామ పంచాయతీకి 2019 సంవత్సరంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎల్కలపెల్లి సుమలత ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌గా ఎన్నికైంది. ప్రస్తుతం జిల్లాలో రెండో విడుత నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని చింతల్లపల్లి గ్రామ సర్పంచ్ పదవికి ఎల్కలపెల్లి సుమలత సింగిల్ నామినేషన్ దాఖలు చేసంది. కాగా సుమలతను సర్పంచ్‌గా ఎన్నికల అధికారి ప్రకటించారు. పంచాయతీలోని 8వార్డులు ఏకగ్రీవం కాగా ఉప సర్పంచ్‌గా 6వ వార్డు సభ్యురాలు సంగ రాధను సభ్యులు ఎన్నుకున్నారు.

ఊపందుకున్న ప్రచారం

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరానికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. ఇప్పటికే గల్లీల్లో ప్రచార వాహనాల మోత మోగుతుండగా అభ్యర్థులు కరపత్రాలతో ఇంటింటీ ప్రచారం నిర్వహిస్తుండడంలో నిమగ్నమయ్యారు. పలువురు అభ్యర్థులు మహిళలకు రోజుకు రు.200లు కూలి చెల్లిస్తూ ప్రచారం చేయించుకోవడంలో బిజీగా మారారు. ఉదయం సాయంత్రం పూట తిరిగి అభ్యర్థులు గ్రామానికి చేయబోయే పనులను వివరిస్తున్నారు. కుల సంఘాలకు మద్యం పంపిణీ చేయడంలో అభ్యర్థులు తలమునకలయ్యారు. ఓ గ్రామంలో కుల సంఘాలకు గొర్రెలను పంపిణీ చేసి మద్యం మత్తులో ముంచుతున్నారని తెలిసింది. మరో గ్రామంలో కుల సంఘ భవనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.70 వేల విద్యుత్ బకాయి చెల్లించినట్టు సమాచారం. అధిక సంఖ్యలో ఓట్లు ఉన్న కుల సంఘాలను మచ్చిక చేసుకునేందుకు ఓ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి రూ.2 లక్షలు చెల్లించి తనకే ఓట్లు వేయాలని అభ్యర్థించాడు. పల్లెల్లో ఎటు చూసినా ఎన్నికల సందడిగా మారింది.

'నామినేషన్లపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు'

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలో గల 25 గ్రామపంచాయితీ, 224 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని జగిత్యాల జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలో 112 మంది సర్పంచ్ అభ్యర్థులు, 494 మంది వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ సెట్లను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలిపారు. ఎవరి నుంచి కూడా ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు రాలేదు.